




RNI NO: APTEL No. 2005/17967

సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

బుధవారం
08-07-2026
శ్రీకాకుళం

సంపుటి: 22
సంచిక: 91
పేజీలు: 8 వెల: రూ.1/-

Postal Regn.No:
D/RNP/SKLM/12/2026-2028

https://www.satyamdaily.net







## ఫుట్‌పాత్ గట్ల తొలగింపు





### ☛జీటీ రోడ్డు నుంచి ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం కార్పొరేషన్‌కు పాచారులు నడవడం కోసం ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయడమే దండగనుకుంటే, ఇప్పుడు ఆ ఫుట్‌పాత్‌ను, రోడ్డును కలిపేసి ర్యాంపులు నిర్మించడంతో ఇటీవల మరణాలు కూడా సంభవించాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ యంత్రాంగం మంగళవారం జీటీ రోడ్డులో ఫుట్‌పాత్ గట్ల తొలగింపునకు శ్రీకారం చుట్టింది. స్థానిక చంద్రమహల్ ఎదురుగా ఇటువంటి ఫుట్‌పాత్ గట్టునే ఢీకొని హయాతినగరానికి చెందిన ఒక యువకుడు ఇటీవలే మరణించిన విషయం అందరికీ తెలుసు. ముఖ్యంగా జీటీ రోడ్డులో కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉండటంతో ఫుట్‌పాత్‌ను, రోడ్డును కలిపేస్తూ అందరూ ర్యాంపులు నిర్మించేశారు. దీనివల్ల పార్కింగ్ కోసం రోడ్డులో సగభాగం పోతుంది. సూర్యమహల్ వరకు సెంటర్ పార్కింగ్ ఉన్నా, ఆ తర్వాత మాత్రం రోడ్డుకు ఇరువైపులా గట్లను వదిలేసి వాహనాలు నిలుపుతుండటంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని గట్లను లేపేశారు.

## అతడు.. ఆమె.. ఓ భార్య!

- ♦సహజీవన కాంక్షతో ప్రేయసితో పరారైన భర్త
- ♦కోయంబత్తూరో నెల రోజులుగా కాపురం
- ♦వారిద్దరికీ నచ్చజెప్పి వెనక్కి తీసుకొచ్చేందుకు భార్య యత్నం
- ♦మార్గమధ్యంలో రైలు బాత్రూంలోనే ప్రేయసీప్రియుల ఆఘాయిత్యం
- ♦చావుబతుకుల మధ్య సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స
- ♦ఇద్దరూ వివాహితులే కావడంతో.. రెండు కుటుంబాల్లో విషాదం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇద్దరికీ వేర్వేరుగా వివాహాలు జరిగాయి.. సొంత సంసారాలు ఉన్నాయి. కానీ వివాహేతర సంబంధం, సహజీవన కాంక్ష వారిని ఆనందమయమైన వైవాహిక జీవితాన్ని, కుటుంబాన్ని కాలదన్ని ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించింది. రైలులో ఈ ఘటన జరగ్గా.. బలవన్మరణానికి ప్రయత్నించిన ఇద్దరూ ప్రస్తుతం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘటన నేపథ్యం కూడా కాస్త చిత్రంగానే ఉంది. పారిపోయిన తన భర్త, అతగాడి ప్రేయసిని స్వయంగా అతని భార్యే ఒప్పించి తీసుకువస్తుండటం, విడిపోవాల్సి వస్తుందనో.. ఇంకేదో ఆలోచనతోనో వారిద్దరూ రైల్లోనే విషం తాగి ప్రాణాల మీదికి తెచ్చుకోవడం వారి స్వగ్రామమైన చాపరలో కలకలం సృష్టించింది. సికింద్రాబాద్ జీఆర్పీ(జనరల్ రైల్వే పోలీస్) ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వరగౌడ్‌తోపాటు చాపర గ్రామస్తుల వివరాలు ప్రకారం..

శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన శ్రీరామ్ శిరీష్‌కుమార్ అలియాస్ సతీష్ (34) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. అతనికి సులోచన అనే యువతితో కొన్నేళ్ల క్రితమై వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. చక్కాగా సాగుతున్న ఆ సంసారంలో

- మిగతా 2వ పేజీలో

## ఉపాధ్యాయుల సమస్యలపై 'ఏపీటీఎఫ్' సమరభేరి

(సత్యంన్యూస్, గార)

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బదిలీల చట్టం వల్ల ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చావలి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టకపోవడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించకపోవడం అత్యంత దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ బృందం బుధవారం గార మండలంలోని వాడాడ, లింగాల వలస, దీపావళి, అంపోలు, శ్రీకూర్మం తదితర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు పలు పాఠశాలలను సందర్శించింది. ఈ సందర్భంగా

- మిగతా 2వ పేజీలో




## క్రీడల్లో ఏఐ విప్లవం..!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) క్రీడా రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోంది. ప్రపంచ ఫుట్‌బాల్‌లో మ్యాచ్ నిర్వహణ నుంచి ఆటగాళ్ల ప్రదర్శన విశ్లేషణ వరకు ఏఐ కీలక పాత్ర పోషిస్తుండగా, భారతదేశంలో ప్రతిభను గుర్తించడం, శిక్షణ ఇవ్వడం, గాయాల నివారణ, పనితీరు మెరుగుదల వంటి అంశాల్లోనూ ఈ సాంకేతికత విస్తృతంగా వినియోగంలోకి వస్తోంది.




టైమ్స్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో..

చివరి పేజీలో

- ◇ప్రతిభ గుర్తింపు నుంచి శిక్షణ వరకు సరికొత్త మార్పులు
- ◇ఫుట్‌బాల్ ప్రపంచ కప్‌లోనూ కీలక పాత్ర
- ◇భారత క్రీడల్లోనూ వేగంగా విస్తరిస్తున్న వినియోగం

## వైఎస్సార్ ఆశయాలే ప్రజా సంక్షేమానికి మార్గదర్శకం

⋆మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

వైఎస్సార్ పాలన, ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు దేశవ్యాప్తంగా తదుపరి ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలిచాయని, భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా, ప్రజాసంక్షేమ రథసారథిగా ప్రజల హృదయాల్లో చిరంజీవిగా నిలిచిపోయారని మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు కొనియాడారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు శ్రీకాకుళంలో ఘనంగా జరిగాయి. నగరంలోని ఏడురోడ్ల జంక్షన్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు.



- శ్రీకాకుళం అభివృద్ధే వైఎస్సార్ ధ్యేయం -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2004 వరకు శ్రీకాకుళం జిల్లా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, కానీ, 2004లో వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక జిల్లా రూపురేఖలు మారాయని ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. విద్య, వైద్య, మౌలిక

- మిగతా చివరి పేజీలో

### తాజ్‌మహల్ శివాలయమా?

## మొఘల్ సమాధా?

- ❖తెరపైకి కొత్త వాదనలు.. హైకోర్టు ఏం చెప్పింది?
- ❖చరిత్రకారుల ఆధారాలు వర్సెస్ పిటిషనర్ల వాదనలు
- ❖కేంద్రం, ఏఎస్ఐలకు హైకోర్టు నోటీసులు
- ❖కోర్టు పర్యవేక్షణలో సర్వే చేయాలని పిటిషన్
- ❖ఆగ్రా కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ అలహాబాద్ హైకోర్టులో అప్పీల్



(సత్యండెస్క్, శ్రీకాకుళం)

ప్రపంచ ప్రసిద్ధ కట్టడం, మొఘల్ కాలపు అద్భుత సృష్టి తాజ్ మహల్ చుట్టూ ఉన్న చారిత్రక వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. తాజ్ మహల్‌ను కోర్టు పర్యవేక్షణలో సర్వే చేయించాలని, అందులో ఉన్న వాస్తవాలను వెలికితీయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాల్సిందిగా అలహాబాద్ హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ)కు నోటీసులు జారీ చేసింది. న్యాయవాది హరిశంకర్ జైన్, పలువురు భక్తులు 'శ్రీ అగ్రేశ్వర మహాదేవ నాగ్‌నాథేశ్వర విరాజమాన్' దైవం తరఫున ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో తాజ్‌మహల్ ప్రాంగణాన్ని తనిఖీ చేయడానికి, ఫోటోలు, వీడియోలు తీయడానికి అనుమతి నిరాకరిస్తూ ఆగ్రా కోర్టు ఇచ్చిన రెండు ఉత్తర్వులను సవాలు చేస్తూ వీరు హైకోర్టును ఆశ్రయించారు. తాజ్‌మహల్‌ను హిందూ దేవాలయంగా ప్రకటించాలని, అక్కడ హిందువులు పూజలు చేసుకునేందుకు అనుమతించాలని పిటిషనర్లు కోరుతున్నారు.

#### 'తేజో మహాలయ' వాదనలు సామాజిక మాధ్యమాల ప్రచారం

తాజ్ మహల్ అనేది వాస్తవానికి 'తేజో మహాలయ' అనే పురాతన హిందూ శివాలయమని, దానిని హిందువులకు అప్పగించాలనే వాదనలు గత కొంతకాలంగా

- మిగతా 2వ పేజీలో

## విధుల్లో చేరిన కొత్త కమిషనర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరపాలక సంస్థకు కొత్తగా నియమితులైన శ్రావణ్ కుమార్ కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయనకు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఉన్న మున్సిపల్ హెల్త్ అధికారి సుధీర్ కుమార్ ఛార్జెస్ అప్పగించగా, అసిస్టెంట్ కమిషనల్ లాగిన్ ఐడీని అందజేశారు. ఇప్పటి వరకు శ్రావణ్ నెల్లూరు జిల్లా కావలి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. కొత్త కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్‌ను సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## 'ఈజిప్షియన్ రాబందు' ఇక చారిత్రకమేనా?

- ✷దక్షిణ భారతదేశంలో వేగంగా అంతరిస్తున్న అరుదైన పక్షి జాతి
- ✷ఒక శతాబ్దంలోపే నీలగిరిలో కనుమరుగైన వైనం
- ✷తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటకల్లో మిగిలినవి 150 లోపే
- ✷తక్షణ సంరక్షణ చర్యలు చేపట్టాలని పర్యావరణ నిపుణుల హెచ్చరిక



ది హిందూ సౌజన్యంతో..

ఒకప్పుడు దక్షిణ భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలు, పురాతన దేవాలయ గోపురాలు, పచ్చికబయళ్లు, రాతికొండలపై సర్వసాధారణంగా కనిపించిన 'ఈజిప్షియన్ రాబందు' ఇప్పుడు మనుగడ పోరాటంలో ఓడిపోతోంది. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషించే ఈ జాతి, తన సహజ ఆవాస ప్రాంతాల నుంచి దాదాపుగా కనుమరుగైంది. గత ఒక శతాబ్ద కాలంలోనే

- మిగతా 2వ పేజీలో

• ఎడిటోరియల్

# అసమానతల అభివృద్ధి!

మన ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోంది.. అగ్రదేశాలతో పోటీపడుతూ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగి అమెరికా, చైనాల వంటి దేశాల సరసన చేరిందని మనం చంకలు గుద్దుకుంటున్నాయి. కానీ పాలకులు చెబుతున్న ఈ ఆర్థిక వృద్ధి పౌరుల స్థాయికి చేరడంలేదని ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన తాజా నివేదిక కుండ బద్దలు కొట్టింది. ఈ నెల ఒకటో తేదీన విడుదల చేసిన కంట్రీ ఇన్‌కమ్ క్లాసిఫికేషన్స్-2026 నివేదిక ప్రకారం.. భారతదేశంలో పౌరుల తలసరి ఆదాయం 2760 డాలర్లు మాత్రమే. అంటే దేశం ఇంకా దిగువ మధ్య ఆదాయ దేశాల జాబితాలోనే కొనసాగుతున్నదన్నమాట. అభివృద్ధి చెందిన దేశాల కంటే ఈ విషయంలో చాలా దిగువన ఉన్నట్లు ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతున్నది. మరో ఆందోళనకర విషయం ఏమిటంటే.. దేశమంతటా తలసరి ఆదాయం ఏకరీతిలో లేదు. రాష్ట్రాల మధ్య తీవ్ర వ్యత్యాసం కనిపిస్తున్నది. కేవలం ఐదు రాష్ట్రాల తలసరి ఆదాయం మాత్రమే ఎగువ మధ్య(అప్పర్ మిడిల్) ఆదాయ స్థాయిని దాటినట్లు వెల్లడించింది. ఈ రేసులో కొన్ని రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతుండగా, మరికొన్ని మెల్లగా అడుగులు వేస్తుంటే.. ఇంకొన్ని పూర్తిగా వెనుకబడి ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు ప్రమాణాల ప్రకారం 4,636 డాలర్లు, అంతకంటే ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న ప్రాంతాలు, దేశాలు అప్పర్ మిడిల్ ఇన్‌కమ్ కేటగిరీలోకి వస్తాయి. ఈ ప్రమాణాన్ని అధిగమించిన రాష్ట్రాలు ఐదు మాత్రమే. ఈ జాబితాల్లో 6217 డాలర్లతో ఢిల్లీ జాతీయస్థాయిలో అగ్రస్థానంలో ఉంటే.. కర్ణాటక (5,579 డాలర్లు), తెలంగాణ (5,407 డాలర్లు), తమిళనాడు (5,329 డాలర్లు), గుజరాత్ (4,734 డాలర్లు) వరుసగా ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. కాస్త తక్కువ తలసరి ఆదాయంతో ఈ రాష్ట్రాలకు అతిచేరువలో మహారాష్ట్ర (4,628 డాలర్లు), హర్యానా (4,627 డాలర్లు), కేరళ (4,610 డాలర్లు) ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన ఆదాయ ప్రమాణాలకు చాలా దగ్గరలో ఉన్నందున ఈ మూడు రాష్ట్రాలు త్వరలోనే ఎగువ మధ్య తరగతి జాబితాలో చేరే అవకాశముంది. ఇక కనిష్ట స్థాయిలను పరిశీలిస్తే బీహార్ చిట్టచివరన ఉంది. ఈ రాష్ట్ర తలసరి ఆదాయం 984 డాలర్లు మాత్రమే. దానికంటే కాస్త పైన ఉత్తరప్రదేశ్ (1,403 డాలర్లు), జార్ఖండ్ (1,470 డాలర్లు) నిలిచాయి. కొన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి చేరువవుతుండగా మరికొన్ని ఇంకా చాలా తక్కువ ఆదాయ స్థాయిలోనే ఉన్నాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. బీహార్ పరిస్థితి మరీ దారుణం. ఆ రాష్ట్ర తలసరి ఆదాయం భారత సగటు కంటే చాలా తక్కువగా ఉండటమే కాకుండా నేపాల్‌తో పాటు కొన్ని ఆఫ్రికా దేశాల కంటే కూడా తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. అయితే గతం కంటే ఇది చాలా మెరుగని తేలింది. గత మూడు దశాబ్దాల్లో భారత ఆర్థిక వ్యవస్థలో గణనీయ మార్పులు చేటు చేసుకున్న విషయాన్ని నివేదిక ప్రస్తావించింది. 1994లో భారత్‌లోని ఏ పెద్ద రాష్ట్రం కూడా మధ్య ఆదాయ కేటగిరీలో లేదు. కానీ ఇప్పుడు అనేక రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆదాయ స్థాయిలో సమానంగా, మరికొన్ని దేశాల కంటే అధిక వృద్ధి సాధించగలిగాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల తలసరి ఆదాయం ఇండోనేషియా (5,120 డాలర్లు), వియత్నాం (4,970 డాలర్లు) దేశాల కంటే ఎక్కువగా ఉంది. మరోవైపు ఢిల్లీ రాష్ట్ర తలసరి ఆదాయం దక్షిణాఫ్రికా (6,270 డాలర్లు), ఫిజీ (6,230 డాలర్లు), మంగోలియా (6,210 డాలర్లు) దేశాలతో దాదాపు సమానంగా ఉంది. ఇది గత 30 ఏళ్లలో భారత రాష్ట్రాల ఆర్థిక పురోగతి ఎంత వేగంగా జరిగిందో సూచిస్తోంది. అయితే దేశంలో రాష్ట్రాల మధ్య అసమానతలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అభివృద్ధి జరిగినప్పటికీ దానితో పోటీ పడుతూ రాష్ట్రాల మధ్య అసమానతలు కూడా పెరిగాయని నివేదిక వెల్లడించింది. ఈ అసమానతలు గతంలో ఉన్న 0.230 నుంచి 0.261 పాయింట్లు పెరగడం గమనార్హం. అత్యంత సంపన్న, అత్యంత పేద రాష్ట్రాల మధ్య ఆదాయ వ్యత్యాసం 2.38 రెట్లు నుంచి 3.73 రెట్లకు పెరిగింది. గత మూడు దశాబ్దాల్లో మధ్య ఆదాయ రాష్ట్రాల తలసరి ఆదాయం 36.7 రెట్లు పెరిగింది. అదే సమయంలో అత్యంత పేద రాష్ట్రాల్లో మాత్రం 26.6 రెట్ల పెరుగుదల మాత్రమే నమోదైంది. అంటే.. దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నా అది అన్ని రాష్ట్రాలకు సమానంగా అందడంలేదని అర్థమవుతుంది. ఈ అసమానతలు ఏ స్థాయిలో పెరిగాయంటే.. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌ను చిన్న రాష్ట్రమైన ఒడిశా అధిగమించింది. ప్రస్తుతం ఒడిశా రాష్ట్ర తలసరి ఆదాయం ఉత్తరప్రదేశ్ కంటే 75 శాతం ఎక్కువ కావడం విశేషం. మరోవైపు అసోం రాష్ట్రం జార్ఖండ్‌ను దాటేసింది. అస్సాం ఆదాయం ఇప్పుడు జార్ఖండ్ కంటే 48 శాతం ఎక్కువ. 1994-95 నాటికి తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్ ఇప్పుడు రాజస్థాన్ స్థాయికి తగ్గిపోయింది. అంతేకాకుండా దేశంలోని ఏడు రాష్ట్రాల కంటే తక్కువ ఆదాయంతో వెనుకబడింది. దేశ ఆర్థిక నాయకత్వం ఇకపై సంప్రదాయ పారిశ్రామిక లేదా వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలకే పరిమితం కాకుండా కొత్త పోకడలు, అభివృద్ధి వివాదాల్లో వైవిధ్యం ద్వారా చిన్న, కొత్త రాష్ట్రాలు వేగంగా ఎదుగుతున్నాయని నివేదికలోని గణాంకాల ద్వారా అర్థమవుతుంది. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం.. భారత్ సగటు తలసరి ఆదాయం ఇంకా దిగువ మధ్య ఆదాయ స్థాయిలో ఉండటమే బాధాకరమైతే.. రాష్ట్రాల మధ్య భారీ అసమానతలు ఉండటం మరింత విచారకరం. చాలా రాష్ట్రాలు ఇంకా ప్రాథమిక ఆదాయ స్థాయిని అధిగమించి ముందుకు రావడానికే పోరాడుతున్నాయి. అంటే భారత్ అభివృద్ధి ప్రయాణం అన్ని రాష్ట్రాల్లో ఒకేలా సాగలేదని, కొన్ని రాష్ట్రాలు వేగంగా ముందుకు దూసుకెళ్తుండగా మరికొన్ని వెనుకబడిపోయాయని ఈ నివేదిక స్పష్టంచేస్తోంది. ఈ పరిస్థితుల్లో అన్ని రాష్ట్రాలు ఏకరీతిలో అభివృద్ధి చెందేలా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. రాష్ట్రాలు కూడా ఈ విషయంలో సమన్వయంతో పనిచేయాల్సి ఉంది.

## తాజ్‌మహల్ శివాలయమా? మొఘల్ సమాధా?

(మొదటిపేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో కొందరు కార్యకర్తలు తాజ్ మహల్‌లోకి ప్రవేశించి శివుడికి ప్రార్థనలు చేయడానికి ప్రయత్నించడం ఉద్రిక్తతలకు దారితీసింది. మొఘల్ రికార్డులలో 'తాజ్ మహల్' అనే పేరు లేకపోవడాన్ని కొందరు సాక్ష్యంగా చూపుతున్నారు. అయితే, ఈ వాదనలను ప్రముఖ చరిత్రకారులు కొట్టిపారేస్తున్నారు. మొఘల్ అధికారిక పత్రాలలో దీనిని 'రౌజా-ఇ మునవ్వరా' (ప్రకాశవంతమైన సమాధి) లేదా 'రౌజా-ఇ ముఅల్లా' అని పిలిచేవారని నిపుణులు చెబుతున్నారు.

**చారిత్రక ఆధారాలు ఏం చెబుతున్నాయి?**

1630లలో ఈ కట్టడం నిర్మించబడుతున్నప్పుడు షాజహాన్ ఆస్థాన చరిత్రకారులైన ముహమ్మద్ అమీన్ కజ్విని, అబ్దుల్ హమీద్ లహోరీలు తమ గ్రంథాలలో (పాద్షాహ్నామా) దీని నిర్మాణ విశేషాలను స్పష్టంగా నమోదు చేశారు. షాజహాన్ తన దివంగత భార్య ముంతాజ్ మహల్ కోసం స్వర్గధామాన్ని భూమిపైనే సృష్టించాలనే సంకల్పంతో 12 ఏళ్ల పాటు శ్రమించి ఈ అద్భుత కట్టడాన్ని నిర్మించారని వారు పేర్కొన్నారు. అలాగే, 1632-33లో ఆగ్రాలో ఉన్న ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రతినిధి పీటర్ ముండీ సైతం షాజహాన్ తన భార్య కోసం ఈ సమాధిని నిర్మిస్తున్నట్లు తన డైరీలో ప్రత్యక్ష సాక్ష్యంగా లిఖించారు.

**చిత్రపటాల్లో ఎందుకు లేదు?**

మొఘల్ చిత్రలేఖనాల్లో తాజ్ మహల్ రూపం ఎక్కడా కనిపించకపోవడంపై వస్తున్న కుట్ర సిద్ధాంతాలను జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) కళా చరిత్రకారిణి కవితా సింగ్ విశ్లేషించారు. 'మొఘలులు చేపట్టిన అనేక భారీ నిర్మాణ ప్రాజెక్టులలో తాజ్ మహల్ ఒకటి. షాజహాన్ తన నిర్మాణ ప్రాజెక్టులకు చిత్రలేఖనం చేయించలేదు. పైగా ఆయన త్వరలోనే తన దృష్టిని న్యూఢిల్లీ (షాజహానాబాద్) వైపు మళ్లించారు. కాబట్టి ఆ కాలంలో ఇదొక సాధారణ నిర్మాణ ప్రక్రియగానే రికార్డు అయింది' అని ఆమె స్పష్టం చేశారు.

**బావి వివాదంపై వివరణ**

తాజ్ మహల్ లోపల హిందూ శైలి బావి (బావోలీ) ఉండటంపై వస్తున్న వాదనలను పరిశోధకులు తోసిపుచ్చారు. తోట నీటి అవసరాల కోసం మసీదుకు దక్షిణాన ఎర్ర ఇసుక రాయితో మెట్ల బావిని మొఘల్ ఇంజనీర్లు నిర్మించారని, శతాబ్దాలుగా భారతీయ నిర్మాణ శైలిలో ఉన్న ఈ విధానాన్ని ముస్లిం శిల్పులు కూడా అవలంబించారని ప్రొఫెసర్ కోచ్ వివరించారు.

**సర్వమానవ సార్వత్రిక చిహ్నం**

చరిత్రను కేవలం పాశ్చాత్య కోణంలోనే కాకుండా భారతీయ వాస్తవాల ఆధారంగా పునర్నిర్మించాల్సిన అవసరం ఉందనే వాదనలు ఉన్నప్పటికీ, అది పక్కా ఆధారాలతో కూడి ఉండాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శతాబ్దాలుగా అన్ని మతాల ప్రజలు, బృందావన యాత్రికులు సైతం తాజ్‌మహల్‌ను దర్శించుకుని ప్రార్థించే సంప్రదాయం ఉందని, ఇది కేవలం ఒక మతానికి చెందినది కాకుండా, యావత్ భారతదేశానికి, ప్రేమకు శాశ్వత చిహ్నంగా నిలుస్తుందని మేధావులు స్పష్టం చేస్తున్నారు.

## అతడు.. ఆమె.. ఓ భార్య!

(మొదటిపేజీ తరువాయి)

అక్రమ సంబంధం నిప్పులు కురిపించింది. శిరీష్‌కు తమ గ్రామానికే చెందిన వివాహిత(34)తో పరిచయం ఏర్పడింది. తన భర్త అనారోగ్యం కారణంగా ఆ వివాహిత తన ఇద్దరు పిల్లలను తీసుకుని హైదరాబాద్ వెళ్లి మూసాపేటలో ఉంటున్న తన సోదరి ఇంట్లో కొన్నాళ్లుగా నివాసం ఉంటున్నది. ఆ ఎడబాటును సహించలేని శిరీష్ కుమార్ తరచూ హైదరాబాద్‌కు వెళ్లి ఆమెతో గడిపి వచ్చేవాడు.

**అక్కడి నుంచి ఇద్దరూ పరార్**

అదేవిధంగా నెలరోజుల క్రితం శిరీష్‌కుమార్ ప్రేయసిని కలుసుకునేందుకు మూసాపేటకు వెళ్లాడు. అక్కడినుంచి వారిద్దరూ అదృశ్యమయ్యారు. అప్పటినుంచీ భార్య సులోచన, ఆమె కుటుంబ సభ్యులు వారికోసం గాలిస్తున్నారు. అయితే వారిద్దరూ తమిళనాడులోని కోయంబత్తూరు ఉన్నట్లు తెలుసుకున్న సులోచన కొందరు బంధువులను తీసుకుని అక్కడికి వెళ్లారు. ఆచూకీ తెలుసుకుని కలుసుకున్నారు. సులోచన భర్తకు నచ్చజెప్పి అతన్ని ప్రియురాలితో సహా తీసుకుని సోమవారం మధ్యాహ్నం శబరి ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌లో హైదరాబాద్‌కు బయల్దేరింది. అంతా సర్దుకుంటుందని అనుకుంటున్న సమయంలో జరగరానిది జరిగింది. రైలు చర్లపల్లి స్టేషన్‌కు సమీపిస్తున్న తరుణంలోనే మంగళవారం ఉదయం 11-12 గంటల మధ్య శిరీష్, అతని ప్రియురాలు అందరి కళ్లుగప్పి ఒకేసారి రైలులోని బాత్రూమ్‌లోకి వెళ్లి గడ్డిమందు తాగేశారు. ఇంటికి వెళ్తే తమను విడదీస్తారని భయపడ్డారో.. విడిగా జీవించలేమని అనుకున్నారో ఏమో గానీ.. బలవన్మరణానికి ప్రయత్నించారు. చాలాసేపైనా వారు బయటకు రాకపోవడంతో తోటి ప్రయాణికుల సాయంతో సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు సులోచన సమాచారం అందజేశారు. రంగప్రవేశం చేసిన పోలీసులు బాత్రూమ్ తలుపులను బలవంతంగా తెరవగా ఇద్దరూ అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే వారిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి క్రిటికల్‌గా ఉందని, అత్యవసర చికిత్స అందిస్తున్నామని వైద్యులు చెప్పారు. ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

## 'ఈజిప్షియన్ రాబందు' ఇక చారిత్రకమేనా?

(మొదటిపేజీ తరువాయి)

నీలగిరి పర్వత ప్రాంతాలలో ఇది పూర్తిగా అంతరించిపోగా, తమిళనాడులో ప్రస్తుతం ఇవి సంతానోత్పత్తి చేయడం లేదని సంరక్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) ఇప్పటికే ఈ పక్షిని 'ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న' జాబితాలో చేర్చింది.

**నాటి సమృద్ధి.. నేటి శూన్యం**

ఈజిప్షియన్ రాబందు ప్రపంచంలోనే అతి చిన్న రాబందులలో ఒకటి. భారతదేశంలో దీని స్థానిక ఉపజాతి అయిన 'నియోఫ్రాన్ పెర్నాప్టెరస్ జింగినియానస్' నివసిస్తుంది. 19వ శతాబ్దపు బ్రిటీష్ పక్షి శాస్త్రవేత్త విలియం రక్షన్ డేవిసన్ రికార్డుల ప్రకారం.. నాటి నీలగిరి, బడగ గ్రామాల్లో ఈ రాబందులు అత్యంత సమృద్ధిగా ఉండేవి. మనుషులంటే అస్సలు భయం లేకుండా తిరిగేవి. 1906లో తిరుకళుకుంద్రంలోని వేదగిరీశ్వరార్ ఆలయ పూజారులు వీటికి ఆహారం పెడుతున్న అరుదైన ఛాయాచిత్రాలు కూడా ఉన్నాయి, ఇది స్థానిక సంస్కృతితో ఈ పక్షికి ఉన్న సుదీర్ఘ బంధాన్ని సూచిస్తుంది. అయితే, ప్రస్తుతం కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ అంతటా కలిపి కేవలం 150 కంటే తక్కువ స్థానిక రాబందులు మాత్రమే మిగిలి ఉన్నాయని బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్ఎస్) అంచనా వేసింది.

**రాయలసీమలోనూ తీవ్ర క్షీణత**

పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలో కూడా ఈ జాతి స్థానికంగా అంతరించిపోయే దశకు చేరుకుందని వన్యప్రాణి నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక్కడ మిగిలి ఉన్న కొద్దిపాటి పక్షులను కాపాడటానికి శాస్త్రీయ జనాభా సర్వేలు, గూళ్లు కట్టుకునే కొండచరియల పరిరక్షణ అత్యవసరమని వారు స్పష్టం చేస్తున్నారు.

**అంతరించడానికి ప్రధాన కారణాలు:**

**ఈ అరుదైన పక్షిజాతి వినాశనానికి మానవ తప్పిదాలు, మారుతున్న సామాజిక పరిస్థితులే కారణమని 'బర్డ్స్ ఆఫ్ ది నీలగిరిస్' గ్రంథ రచయిత పి.జె. వసంతన్ పేర్కొన్నారు. నిపుణుల విశ్లేషణ ప్రకారం ప్రధాన కారణాలు:**

**డైక్లోఫెనాక్ ప్రభావం:** పశువులకు వాడే 'డైక్లోఫెనాక్' వంటి నాన్-స్టెరాయిడల్ యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ కలిగిన కళేబరాలను తినడం వల్ల ఇవి విషప్రయోగానికి గురవుతున్నాయి.

**ఆహార కొరత:** పశుపోషణ తగ్గడం, కుటుంబాలు స్థిర వ్యవసాయం వైపు మళ్లడంతో జంతు కళేబరాల లభ్యత క్షీణించింది.

**విద్యుదాఘాతాలు:** విస్తరిస్తున్న హై-వోల్టేజ్ విద్యుత్ తీగలు, మౌలిక సదుపాయాల వల్ల పక్షులు షాక్‌కు గురై మరణిస్తున్నాయి.

**ఆవాసాల విధ్వంసం:** ఇవి గూళ్లు కట్టుకునే రాతి కొండచరియల వద్ద మానవ జోక్యం, క్వారీ పనులు పెరగడం.

**'కార్యాత్మకంగా అంతరించిపోయింది'**

పర్యావరణ పరిరక్షణ స్వచ్ఛంద సంస్థ 'అరులగం' కార్యదర్శి ఎస్.భారతిదాసన్ మాట్లాడుతూ.. "తమిళనాడులో ప్రస్తుతం గూడు కట్టుకునే ఒకే ఒక్క జంట మనుగడ సాగిస్తున్నట్లు ధృవీకరించని నివేదికలు ఉన్నాయి. అన్ని విధాలుగా చూస్తే రాష్ట్రంలో ఈజిప్షియన్ రాబందు 'కార్యాత్మకంగా అంతరించిపోయింది'. భారతదేశంలోని అన్ని రాబందు జాతులలో దీనికే తక్షణ రక్షణ అవసరం" అని అన్నారు. ప్రస్తుతం శీతాకాలంలో చెన్నై, తిరునెల్వేలి ప్రాంతాల్లో కనిపించే రాబందులు ఆఫ్రికా, మధ్యప్రాచ్యం నుంచి వలస వచ్చేవే కానీ, ఇక్కడి స్థానిక పక్షులు కావని నిపుణులు స్పష్టం చేశారు. ప్రస్తుతం కర్ణాటకలోని రామనగర (రామదేవరబెట్ట) రాతి కొండలు మాత్రమే ఈ జాతికి దక్షిణ భారతదేశంలో మిగిలి ఉన్న చివరి బలమైన ఆశ్రయంగా నిలుస్తోంది.

**ప్రత్యేక పెంపక కేంద్రాలకు నిపుణుల పిలుపు**

ఈ విపత్కర పరిస్థితుల నేపథ్యంలో, 'తమిళనాడు రాప్టర్ రీసెర్చ్ ఫౌండేషన్' (టీఎన్‌ఆర్‌ఆర్‌ఎఫ్) నిపుణుల కమిటీ సమావేశంలో బీఎన్‌హెచ్ఎస్ ఒక కీలక ప్రతిపాదనను సమర్పించింది. హర్యానా, మధ్యప్రదేశ్, అస్సాంలలో గైప్స్ రాబందుల కోసం విజయవంతంగా అమలు చేసిన సంరక్షణ-సంతానోత్పత్తి నమూనాను ఈజిప్షియన్ రాబందుల కోసం కూడా స్వీకరించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోరింది.

నీలగిరి, ధర్మపురి, కృష్ణగిరి లేదా కోయంబత్తూరు పరిసరాల్లో ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటుచేసి కృత్రిమ పొదిగే ప్రక్రియ, పిల్లల పెంపకం చేపట్టాలని సిఫార్సు చేసింది. విద్యుత్ తీగలకు 'బర్డ్ డైవర్టర్స్' ఏర్పాటు చేయడం, రాబందులకు సురక్షితమైన ఆహార మండలాలను స్థాపించడం, దక్షిణ రాష్ట్రాల (తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) అటవీ శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఈ పర్యావరణ పారిశుధ్య పక్షిని కాపాడుకోగలమని సంరక్షణవాదులు గట్టిగా నొక్కి చెబుతున్నారు.




**సవరణ**

కొత్తూరు మండల సర్వసభ్య సమావేశంపై సంచలన సాయంకాల పత్రిక 'సత్యం' 07.07.2026 సంచికలో ప్రచురించిన వార్తలో లోతుగడ్డ తలసీ వరప్రసాద్ హోదా వైస్ ఎంపీపీకి బదులు పొరపాటున వైసీపీ ఎంపీటీసీ అని ముద్రితమైంది. దాన్ని వైస్ ఎంపీపీగా చదువుకోగలరు. జరిగిన పొరపాటుకు క్షంతవ్యులం.

– ఎడిటర్







## ఉపాధ్యాయుల సమస్యలపై 'ఏపీటీఎఫ్' సమరభేరి

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నేతలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా వాడాడ, లింగాలవలస, దీపావళి జెడ్పీ హైస్కూళ్లలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని, అలాగే భవన నిర్మాణ విరాళాల సేకరణను నాయకులు ప్రారంభించారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చావలి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వి.నవీన్‌కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.శంకరరావు, గార మండల శాఖ అధ్యక్షులు జి.గోవిందరావు, మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ త్రినాధరావు తదితర ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీముఖలింగం హోమియో ఆసుపత్రికి మహర్దశ

❖ ఆగస్టు నెలాఖరుకల్లా పునఃప్రారంభం

(సత్యంన్యూస్, జలుమూరు)

గత రెండేళ్లుగా తాళాలు వేసి ఉన్న జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామంలోని ప్రభుత్వ హోమియో ఆసుపత్రికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ ఏడాది ఆగస్టు నెలాఖరుకల్లా నూతన సిబ్బందిని నియమించి, ఆసుపత్రిని పూర్తిస్థాయిలో పునఃప్రారంభిస్తామని జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఉత్తమ రాజు ప్రకటించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన శ్రీముఖలింగంలోని ఆసుపత్రి భవనాన్ని స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.



**పీజీఆర్ఎస్ ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం**

శ్రీముఖలింగం గ్రామంలో సుమారు 50 సంవత్సరాల క్రితం ఏర్పాటైన ఈ ప్రభుత్వ హోమియో ఆసుపత్రి ఎంతోమందికి వైద్య సేవలు అందించింది. అయితే, గత రెండేళ్లుగా సిబ్బంది లేకపోవడం, నిర్వహణ కరువవ్వడంతో ఆసుపత్రికి తాళాలు వేసి ఉంచారు. దీనివల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై శ్రీముఖలింగేశ్వర దేవస్థానం ప్రధాన అర్చకులు, అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నాయుడు గారి రాజశేఖర్ చొరవ తీసుకున్నారు. ఈ నెల 3వ తేదీన జిల్లా కలెక్టర్‌కు 'పీజీఆర్ఎస్' (జనవాణి) ద్వారా అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఆసుపత్రికి చిన్న చిన్న మరమ్మతులు చేసి, తక్షణమే రీ-ఓపెన్ చేయాలని ఆయన కోరారు.

**కలెక్టర్ ఆదేశం.. ఆయుష్ అధికారి హామీ**

ప్రధాన అర్చకుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్, ఈ వ్యవహారంపై విచారణ జరిపి వెంటనే ఆసుపత్రిని తెరవాలని జిల్లా ఆయుష్ అధికారి ఉత్తమ రాజును ఆదేశించారు. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీముఖలింగం చేరుకున్న ఆయుష్ అధికారి, హోమియో




ఆసుపత్రిని స్వయంగా పరిశీలించారు. భవనానికి అవసరమైన చిన్నపాటి మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని, ఆగస్టు ఆఖరి నాటికి నూతన సిబ్బందిని (డాక్టర్, పారామెడికల్ స్టాఫ్) డిప్యుటేషన్‌పై నియమించి ఆసుపత్రిని పునఃప్రారంభిస్తామని స్థానికులకు నమ్మకమైన హామీ ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆయుష్ అధికారితో పాటు హోమియో విభాగానికి చెందిన సిబ్బంది, దేవస్థానం అర్చకులు, గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హామీ లభించడంతో 50 ఏళ్ల చరిత్ర గల ఆసుపత్రి మళ్లీ ప్రజలకు అందుబాటులోకి రానుండటం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## లక్ష్మి గణపతి ఆలయ పునఃప్రతిష్ట

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

మండలం కింతలి మిల్ జంక్షన్‌లోని శ్రీ లక్ష్మి గణపతి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి సాయి కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని, వేద పండితుల ఆశీర్వచనాల అనంతరం ఆయన తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆ లక్ష్మి గణపతి స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహంతి పెద రామునాయుడు, కొత్తకోట సూర్యరావు, కూన మురళీ, గురుగుబెల్లి లక్షుంనాయుడు, వావిలాపల్లి చైతన్య, పైడి తారక్, మహంతి జోగినాయుడు, వైకాపా సీనియర్ నాయకులు మహంతి సత్యం తదితరులు పాల్గొన్నారు.



## భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

మండల కేంద్రంలో జరుగుతున్న భూ ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం నరసన్నపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక భూమాఫియా పెరిగిపోయిందని, మండలంలో సుమారు పది చెరువులు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. అనుమతులు లేని హాస్పిటల్స్, బిల్డింగులపై అధికారులు చర్యలు తీసుకోకపోతే, సీపీఐ ఆధ్వర్యంలో ఆ ఆక్రమిత భూములను పేదలకు పంచిపెడతామని హెచ్చరించారు. అలాగే మండలంలో లోపించిన పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.అరవింద్, లవకుమార్, భాస్కరరావు, వసంత్, వెంకటరావు, జమ్మరాజు, ముఖలింగం, లక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## రోగిని పరామర్శించిన నాయకులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళానికి చెందిన డి.మీనాక్షి (భర్త నాగరాజు) రిమ్స్ ఆసుపత్రిలో కాలర్ బోన్ సర్జరీ చేయించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర శిష్టకరణ సంఘం ఉపాధ్యక్షులు, విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ జిల్లా కన్వీనర్ బలివాడ సత్యవతి, రిమ్స్ ఆసుపత్రి హెచ్.డి.ఎస్ డైరెక్టర్ బలివాడ వరప్రసాద్‌లు ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. దీనిలో భాగంగా వారు రోగి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.



## ఘనంగా వైఎస్సార్ జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వర్గీయ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. డీసీసీ అధ్యక్షులు సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో పాత ఏపీ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని బెహరా మానసిక వికలాంగుల కేంద్రంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు. అనంతరం అక్కడి పిల్లల మధ్య కేక్ కట్ చేసి, వారికి అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు అన్నాజీరావు మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నకాలం ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణయుగమని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ వంటి చారిత్రాత్మక పథకాలు బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాయని గుర్తుచేశారు. పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వైఎస్సార్ జయంతిని ఇలాంటి మానసిక వికలాంగ పిల్లల మధ్య జరుపుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు కలిసి ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, నాయకులు మంత్రి నరసింహమూర్తి, ఈశ్వరి, అంబోతుల వెంకటనాయుడు, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

(సత్యంన్యూస్, వజ్రపుకొత్తూరు)

చెట్లను విచ్చలవిడిగా నరికివేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని భూతాపం పెరుగుతుందని, కాబట్టి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకులు తామాడ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మండలంలోని దిబ్బవానిపేట గ్రామంలోని బీచ్ రోడ్డుపై బుధవారం ఉద్దానం అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సమితి వ్యవస్థాపకులు తామాడ లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రామ ఇన్‌చార్జిలు గీత నీలకంఠం, సూరాడ సురేష్ సహకారంతో సభ్యులు కలిసి 30 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విచ్చలవిడిగా చెట్లను నరకడం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ప్రకృతి సంపదను నాశనం చేయడం మానవాళి మనుగడకే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తి కనీసం పది మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుంటు విజయ్, మండల మహేష్, చింత దానేష్, మండల నీలయ్య, దాసరి జానకి రామ్, దండుపాటి పవన్ కుమార్, బైపల్లి నారాయణ, కంబాల రాంబాబు, గీత బాలరాజు, సుంకర రాణి, బొడ్డు రజినిలు పాల్గొన్నారు.



## నీలమ్మ తల్లి సంబరాలకు సర్వం సిద్ధం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

రూరల్ మండలం సింగుపురం గ్రామంలో గురువారం నిర్వహించనున్న శ్రీ నీలమ్మతల్లి సంబరాలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సురేష్, గ్రామ సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడుతో కలిసి ఆలయ పరిసరాలు, ప్రధానవీధులు, కూడళ్లు, భక్తుల రాకపోకలు జరిగే మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, అత్యవసర సేవలకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు. సంబరాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ యువత, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, బ్యారికేడ్లు, వాహనాల పార్కింగ్ వంటి సౌకర్యాలను సిద్ధం చేశామని చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో గ్రామ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించేలా నీలమ్మ తల్లి సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తులందరూ క్రమశిక్షణతో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన పిలుపునిచ్చారు.



## డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేశవరావు పేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8 నుండి 10వ తరగతి విద్యార్థులకు రిప్ కరెంట్ (సముద్రపు అలల సుడిగుండాలు), డ్రగ్స్ నియంత్రణపై బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ జి.హరికృష్ణరావు తన సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సముద్రంలో స్నానాలకు వెళ్లే సమయంలో 'రిప్ కరెంట్' వచ్చేటప్పుడు నీటి రంగు ఎలా మారుతుంది, ఆ సమయంలో ప్రాణాలు ఎలా రక్షించుకోవాలనే జాగ్రత్తలను ఆయన విద్యార్థులకు వివరించారు. అలాగే డ్రగ్స్‌కు బానిసలైతే జీవితాలు ఎలా నాశనమవుతాయో, సమాజానికి జరిగే నష్టాన్ని క్షుణ్ణంగా తెలియజేశారు. వీటితోపాటు మహిళలు, బాలికలపై జరుగుతున్న దౌర్జన్యాలు, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగం గురించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1093 కి లేదా కళింగపట్నం ఎస్.హెచ్.ఓ మొబైల్ నెంబర్ 9392914712 కి సమాచారం అందించాలని ఎస్సై హరికృష్ణ రావు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.గోవిందరావు, విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## 'సత్యం' సినిమా

### 'క్వీన్-2' చుట్టూ లీగల్ వ్యూహం

**బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ కెరీర్‌ను మలుపు తిప్పి, ఆమెకు జాతీయ అవార్డుతో పాటు 'క్వీన్' అనే ట్యాగ్‌ను తెచ్చిపెట్టిన ల్యాండ్‌మార్క్ సినిమా 'క్వీన్'. ఇప్పుడు ఈ సినిమా సీక్వెల్ చుట్టూ ఒక ఊహించని వివాదం రాజుకుంది. అయితే ఈసారి వివాదం స్క్రీన్ మీద కాదు.. కోర్టు రూమ్‌లో! 'క్వీన్-2' హక్కుల పోరు ఇప్పుడు బాంబే హైకోర్టు మెట్లు ఎక్కింది.**

తమ అనుమతి లేకుండా 'క్వీన్-2'ను రూపొందిస్తున్నారంటూ ప్రముఖ నిర్మాణ సంస్థ ఫాంటమ్ స్టూడియోస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఓటీటీ దిగ్గజం జియో హాట్‌స్టార్‌పై ఏకంగా రూ.250 కోట్ల పరువునష్టం, నష్టపరిహారం కోరుతూ బాంబే హైకోర్టులో భారీ దావా వేసింది. 2014 నాటి ఒరిజినల్ 'క్వీన్' చిత్రానికి సంబంధించిన 50 శాతం హక్కులతో పాటు, దాని సీక్వెల్ రూపొందించే రైట్స్ కూడా చట్టబద్ధంగా తమ వద్దే ఉన్నాయని ఫాంటమ్ స్టూడియోస్ గట్టిగా వాదిస్తోంది. ఈ రైట్స్ వ్యవహారంపై గతంలో పలుమార్లు జియో హాట్‌స్టార్‌తో చర్చలు జరిపినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతోనే ఫాంటమ్ స్టూడియోస్ లీగల్ రూట్ ఎంచుకున్నట్లు తెలుస్తోంది. హక్కుల వివాదం పూర్తిగా తేలకముందే సీక్వెల్ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లడం ముమ్మాటికీ చట్టవిరుద్ధమని వారు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ సీక్వెల్స్‌లో ఒకటిగా ఉన్న 'క్వీన్-2'పై ఇలాంటి లీగల్ బాంబ్ పడటంతో బీ-టౌన్ అంతా ఒక్కసారిగా షాక్‌కు గురైంది. మరి ఈ రూ.250 కోట్ల భారీ దావాపై బాంబే హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది? జియో హాట్‌స్టార్ దీనికి ఎలా కౌంటర్ ఇస్తుంది? అనేది ఇప్పుడు ఇండస్ట్రీలో అత్యంత ఆసక్తికరంగా మారింది!




## మమ్మీ అయినా తగ్గని గ్లామర్!!



**బాలీవుడ్‌లో అడుగుపెట్టిన మొదటి రోజు నుంచే తనదైన విలక్షణ శైలితో, అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది సోనమ్ కపూర్. ర్యాంప్ పై అప్పట్లో ఈమె సృష్టించిన సెన్సేషన్ అంతా ఇంతా కాదు. అందుకే బీ-టౌన్ అంతా ఈమెను ప్యూర్ 'ఫ్యాషనిస్టా' అని పిలుచుకుంటుంది. పెళ్లై, ఒక బిడ్డకు తల్లి అయినా సరే.. గ్లామర్ డోస్ లో గానీ, స్టైల్ స్టేట్‌మెంట్‌లో గానీ ఈ కపూర్ బ్యూటీ అస్సలు తగ్గడం లేదు!**

### అన్షులా పెళ్లిలో 'రాయల్' హంగామా!

**ఇటీవల తన సోదరి అన్షులా కపూర్ పెళ్లి వేడుకలో సోనమ్ కపూర్ ల్యాండ్ అయింది. ఇంకేముంది.. అక్కడ కెమెరా కళ్లన్నీ ఈమె వైపే తిరిగాయి. ప్రముఖ డిజైనర్ అనామికా ఖన్నా ప్రత్యేకంగా డిజైన్ చేసిన పర్పుల్ కేప్ అవుట్‌ఫిట్‌లో సోనమ్ ఒక నిజమైన రాకుమారిలా మెరిసిపోయింది.**

### ఇంట్రెస్టింగ్ ఫ్యాక్ట్:

ఈ డ్రెస్ వెనుక ఓ పెద్ద కథే ఉంది! ఈ కేప్‌పై చేసిన క్లిష్టమైన ఎంబ్రాయిడరీ వర్క్ పూర్తి చేయడానికి ఏకంగా 6 నెలల సమయం పట్టిందట. రియా కపూర్, అభిలాష స్టైలింగ్ చేయగా.. నమ్రతా సోని మేకప్‌తో సోనమ్‌కు పర్‌ఫెక్ట్ రాయల్ లుక్ ఇచ్చారు. దీనికి సంబంధించిన ఫోటో షూట్ పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. నెటిజన్లు సైతం "బాలీవుడ్ రాయల్టీ", "రియల్ క్వీన్" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఒకవైపు లండన్ టు ఇండియా బిజినెస్ సామ్రాజ్యాన్ని విస్తరిస్తూ, మరోవైపు మమ్మీగా బాధ్యతలు చూసుకుంటూనే.. ఫ్యాషన్ వరల్డ్‌లో తన రూటే సెపరేట్ అని నిరూపిస్తోంది.

### సిల్వర్ స్క్రీన్ పై కంబ్యాక్ ఎప్పుడు?

ప్రస్తుతం బిజినెస్, ఫ్యాషన్ ప్రాజెక్టులు, ఫ్యామిలీతో బిజీగా ఉన్న ఈ ఎంటర్‌ప్రెన్యూర్.. మళ్లీ వెండితెరపై ఎప్పుడు మెరుస్తుంది? ఇదే ఇప్పుడు అభిమానుల హాట్ టాపిక్. ఈ 2026-2027 సీజన్‌లో సోనమ్ కంబ్యాక్ ఇచ్చే ఛాన్స్ గట్టిగానే కనిపిస్తోంది. తనకు సెట్ అయ్యే స్ట్రాంగ్ క్యారెక్టర్, పవర్‌ఫుల్ స్టోరీ దొరికితే ఈ ఏడాదే సోనమ్ మళ్లీ మేకప్ వేసుకోవడం ఖాయం. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే వరకు.. ఈ కపూర్ క్వీన్ తన స్టన్నింగ్ లుక్స్‌తో ఫ్యాన్స్‌కు ఐ-ఫీస్ట్ ఇస్తూనే ఉంటుంది!

# వైఎస్సార్ ఆశయాలే ప్రజా సంక్షేమానికి మార్గదర్శకం



(మొదటిపేజీ తరువాయి)

సదుపాయాల రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, జిల్లా ప్రజల జీవన ప్రమాణాలను పెంచిన మహానుభావుడు వైఎస్సార్ అని ధర్మాన గుర్తుచేశారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఉద్దానం ప్రాంత తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే కాకుండా, కిడ్నీ బాధితుల కోసం ప్రత్యేక ఆస్పత్రిని నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు అండగా నిలిచారని స్పష్టం చేశారు.

**కూటమి ప్రభుత్వంపై ఘాటు విమర్శలు**

ప్రస్తుత ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లా పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని ధర్మాన ప్రసాదరావు మండిపడ్డారు. రూ. 3.5 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో, వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు కనీసం రూ. వెయ్యి కోట్ల పెట్టుబడులు లేదా అభివృద్ధి పనులైనా తెచ్చారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు ఎన్నిసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా జిల్లాకు చెప్పుకోదగ్గ పనులేవీ చేయలేదని విమర్శించారు. తాను ఈ వ్యాఖ్యలు ఎవరినో అవమానించడానికి చేయడం లేదని, జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలనే ఉద్దేశంతోనే శాసనసభ లోపలా, వెలుపలా నిలదీస్తున్నట్లు స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులు స్తంభించిపోయాయి**

జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ధర్మాన ఆరోపించారు. జూలై నెల సగం గడిచినా వంశధారలో చుక్క నీరు లేదని, ఒడిశా వివాదం వల్ల రిజర్వాయర్ ఆలస్యమవుతుందని తెలిసినా, కేవలం రూ. 176 కోట్లతో నిర్మించాల్సిన బ్యారేజ్ పనులను కూడా ఈ ప్రభుత్వం రెండేళ్లుగా ప్రారంభించలేకపోయిందని ధర్మాన విమర్శించారు. రూ. 160 కోట్లతో కలెక్టరేట్ భవనానికి నిధులు మంజూరైనా నేటికీ పనులు పూర్తి కాలేదు. ప్రజల సొమ్ము ఎటు పోతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా ప్రజలపై ఉన్న ప్రేమ, వారి ప్రయోజనాల రక్షణే ధ్యేయంగా తాము వైఎస్సార్ కుటుంబం వెంట నడుస్తున్నామని ధర్మాన ప్రసాదరావు పునరుద్ఘాటించారు. మహానేత ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు ధర్మాన రామ్మనోహర్ నాయుడు, ఎంవీ పద్మావతి, గేదెల పురుషోత్తం, ఎంవీ స్వరూప్, అంధవరపు సూరిబాబు, ఎంఎ రఫీ, మండవిల్లి రవి, చల్లా శ్రీను, శ్రీనివాస్ పట్నాయిక్, ఎన్ని ధనుంజయ, గొండు రఘురాం, కిల్లి సత్యనారాయణ, ముంజేటి కృష్ణ, టి.కామేశ్వరి, చల్లా రవి, పొన్నాడ రుషి, గొండు కృష్ణ, నల్లబారిక శ్రీను, నాగేశ్వరరావు, అంబటి శ్రీను, మార్పు పృధ్వీ, సాధు వైకుంఠం, రావుపల్లి సురేంద్ర, బొడ్డేపల్లి పద్మజ, తంగి అప్పలనాయుడు, సీపాన మహేంద్ర, పిన్నింటి సాయితో పాటు పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ఆముదాలవలస కేంద్రంగా పనిచేస్తున్న అరుణోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ జరిగింది. ఇండియన్ బైబిల్ లెటర్స్ ట్రస్ట్ సహకారంతో అర్హులైన పలువురు మహిళలకు ఈ కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ జి.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు కేవలం అక్షరాస్యత మాత్రమే కాకుండా, వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారానే వారు ఆర్థికంగా స్థిరపడగలరన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కాళ్లపై తాము నిలబడాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కేసారం అప్పలరాజు, జాన్ పీటర్, అబ్రహం, సాంబమూర్తి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా యువత సత్తా చాటాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'అమరావతి ఛాంపియన్‌షిప్-2026' క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (స్టెప్) ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పోటీల గోడపత్రికను బుధవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 17 ఏళ్లలోపు మరియు 23 ఏళ్లలోపు బాలురు, బాలికల విభాగాలలో మొత్తం 12రకాల క్రీడాంశాల్లో ఈ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం జిల్లా క్రీడాధికారి (డీఎస్‌డీవో) మహేష్ మాట్లాడుతూ ఈ క్రీడల నిర్వహణ షెడ్యూల్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 15 నుండి 25 వరకు నియోజకవర్గస్థాయి ట్రయల్స్ నిర్వహిస్తామని, ఆ తర్వాత జూలై 26 నుండి ఆగస్టు 10 వరకు జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వీటిలో ప్రతిభ కనబరిచిన వారికి ఆగస్టు 20 నుండి 26 వరకు రాష్ట్రస్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తామని వివరించారు. జిల్లాలోని అర్హత గల క్రీడాకారులందరూ వెంటనే తమ పేర్లను నమోదు చేసుకుని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.




## ఉచిత ఫిజియోథెరపీ కేంద్రం ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న శ్రీ సత్యసాయి మందిరం నూతన భవనంలో 'శ్రీ సత్య సాయి ఉచిత ఫిజియోథెరపీ కేంద్రాన్ని' బుధవారం ఘనంగా ప్రారంభించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణ రావు ఈ కేంద్రానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా బోధించిన "అందరినీ ప్రేమించండి... అందరినీ సేవించండి" అనే సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఉచిత ఫిజియోథెరపీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ఇటువంటి ఉచిత ఫిజియోథెరపీ కేంద్రం ఇదే మొదటిదని, ఇందులో అత్యాధునిక పరికరాలను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. రోగుల సౌకర్యార్థం మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా చికిత్సా విభాగాలను ఏర్పాటు చేసినట్లు లక్ష్మణరావు తెలిపారు. శ్రీకాకుళం నగరంతో పాటు జిల్లా ప్రజలందరూ ఎలాంటి రుసుము చెల్లించకుండా ఈ సేవలను వినియోగించుకుని ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని ఆయన కోరారు. ఈ కేంద్ర నిర్వహణ కోసం ఫిజియోథెరపీలో మాస్టర్స్ డిగ్రీ పొందిన నిపుణులు డాక్టర్ ప్రసాద్‌ను నియమించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమలా త్రివేణి, డాక్టర్ బాలకృష్ణ, విశ్వనాథం, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, పుణ్యవతి, బోయిన నరసింహమూర్తి, టి.ఎస్.ఎన్.మూర్తి, బి.అప్పారావు, లలిత, సుజాత, కన్వీనర్లు కె.భాస్కరరావు, కె.మురళీకృష్ణ, ఎ.ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వైఎస్సార్ జయంతి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలను ఆమదాలవలస పట్టణంలో వైకాపా శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పట్టణంలోని వైయస్సార్ కూడలి వద్ద నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ముఖ్య నాయకులతో కలిసి వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) వెళ్లి అక్కడి రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ పేదల గుండెల్లో స్థిరమైన స్థానం సంపాదించుకున్న ఏకైక ప్రజానేత వైయస్ రాజశేఖరరెడ్డి మాత్రమేనని కొనియాడారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ఎల్లప్పుడూ పేదవాడి గుండెల్లో గూడు కట్టుకుని బతికే ఉంటారని, ఆయన నిజమైన ప్రజల మనిషి అని గుర్తుచేసుకున్నారు. వైఎస్సార్ లేని లోటు పూడ్చలేనిదన్నారు. కార్యక్రమంలో వైకాపా మున్సిపల్ నాయకులు, మండల పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైకాపా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాతపట్నం గురుకుల పాఠశాల విద్యార్థిని చింతల పూజ మృతి కేసులో బాధ్యులైన ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, ఆమెకు చేసిన బదిలీని రద్దు చేయాలని దళిత ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య మాట్లాడుతూ గురుకులాల్లో విద్యాప్రమాణాలతోపాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురుకుల పాఠశాలల పరిస్థితిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యార్థిని మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోకుండా కేవలం బదిలీలతో సరిపెట్టడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ తరఫున తాము కోరిన డిమాండ్లను ప్రభుత్వం, అధికారులు నెరవేర్చకపోతే.. ఈ నెల 23న శ్రీకాకుళంలోని జిల్లా గురుకులాల కో-ఆర్డినేటర్ కార్యాలయాల వద్ద నిరవధిక ధర్నా చేపడతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల జేఏసీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# క్రీడల్లో ఏఐ విప్లవం..!



ప్రపంచ ఫుట్‌బాల్‌లో ఇప్పటికే ఏఐ ఆధారిత మ్యాచ్ బంతులు రిఫరీలకు వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతున్నాయి. అలాగే కోచ్‌లు, మేనేజర్లు, విశ్లేషకులు లక్షలాది డేటా పాయింట్లను పరిశీలించి ఆటగాళ్ల ప్రదర్శనను అంచనా వేయడానికి ఏఐ అల్గారిథమ్‌లను వినియోగిస్తున్నారు. స్టార్ ఆటగాళ్లను పూర్తిగా నియంత్రించలేకపోయినా, భవిష్యత్ ప్రతిభను గుర్తించడంలో మాత్రం ఏఐ కీలక సాధనంగా మారుతోంది. భారతదేశంలోనూ అథ్లెట్ల శిక్షణలో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోంది. యువ క్రీడాకారులను గుర్తించే ఏఐ స్కౌటింగ్ వ్యవస్థలు, వేరబుల్ పరికరాల ద్వారా శారీరక సామర్థ్యాల విశ్లేషణ, బయోమెకానిక్స్ ఆధారిత శిక్షణ ప్రస్తుతం అనేక అకాడమీల్లో అమలవుతోంది. రిలయన్స్ ఫౌండేషన్ అథ్లెటిక్స్ డైరెక్టర్ జేమ్స్ హిలియర్ మాట్లాడుతూ, గతంతో పోలిస్తే ఇప్పుడు కోచింగ్, బయోమెకానిక్స్, పనితీరు విశ్లేషణలో అపారమైన సమాచారం అందుబాటులో ఉందని తెలిపారు. భారత స్ప్రింటర్ గురిందర్వీర్ సింగ్ 100 మీటర్ల పరుగులో 10.09 సెకన్ల మార్కు చేరుకోవడంలో ఏఐ ఆధారిత 'ఆప్టోజంప్' సాంకేతికత కీలకంగా పనిచేసిందన్నారు. అథ్లెట్ శరీర నిర్మాణం, ఎత్తు, వైద్య నివేదికలను విశ్లేషించి డిజిటల్ ప్రొఫైల్ రూపొందించడం ద్వారా మెరుగైన శిక్షణా ప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఇదే తరహాలో గోస్పోర్ట్స్ ఫౌండేషన్, ఇన్ఫోసిస్ భాగస్వామ్యంతో రూపొందించిన 'డిజిటల్ అథ్లెట్ ట్విన్' ప్రాజెక్ట్ కూడా అథ్లెట్ల పనితీరును ముందుగానే అంచనా వేసి శిక్షణా విధానాలను మెరుగుపరుస్తోంది. పోషకాహారం, శిక్షణా పద్ధతులు, వ్యాయామాల్లో మార్పులు చేస్తే వచ్చే ఫలితాలను ముందుగానే పరీక్షించే అవకాశం ఈ సాంకేతికత కల్పిస్తోంది.

బెంగళూరుకు చెందిన 'మచాక్స్' స్టార్టప్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల కోసం ఏఐ కోచ్‌ను అభివృద్ధి చేసింది. ఆటగాళ్లు తమ శిక్షణ వీడియోలను అప్‌లోడ్ చేస్తే గ్రిప్, స్మాష్ వేగం, ఫుట్‌వర్క్ వంటి దాదాపు 40 సాంకేతిక అంశాలను విశ్లేషించి లోపాలను సూచించడంతో పాటు సరైన టెక్నిక్‌కు సంబంధించిన వీడియోలను కూడా అందిస్తోంది. దీంతో నాణ్యమైన కోచింగ్ మరింత మందికి అందుబాటులోకి వస్తోందని సంస్థ పేర్కొంది. ఏఐ మరో ప్రధాన ప్రయోజనం బహుభాషా సామర్థ్యమని నిపుణులు చెబుతున్నారు. ప్రాంతీయ భాషల్లోనే ప్రశ్నలు అడిగి, అదే భాషలో శిక్షణా సూచనలు పొందే అవకాశం ఉండటంతో గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు కూడా ఇది ఉపయోగపడనుంది. పారా స్విమ్మర్ హిమాన్షు నందల్ కూడా వేరబుల్ పరికరాలు, ఏఐ వీడియో విశ్లేషణ ద్వారా తన శిక్షణను మెరుగుపరుచుకుంటున్నట్లు తెలిపారు. అయితే మానవ కోచ్‌లకు ప్రత్యామ్నాయంగా ఏఐను చూడలేమని, ప్రస్తుతం మానవ కోచ్‌ల కచ్చితత్వంతో పోలిస్తే ఏఐ ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. ప్రతిభను గుర్తించడంలోనూ ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. బ్రెజిల్‌లో యువ ఫుట్‌బాల్ ఆటగాళ్లు తమ వీడియోలను అప్‌లోడ్ చేస్తే ఏఐ వాటిని విశ్లేషించి ప్రతిభావంతులను ఎంపిక చేసే వ్యవస్థ అమల్లో ఉంది. భారతదేశంలో చెన్నైకు చెందిన 'స్కౌట్ ఎడ్జ్' స్టార్టప్ చిన్న పట్టణాల్లోని యువ క్రికెటర్ల ప్రతిభను గుర్తించేందుకు ఏఐ ఆధారిత ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేసింది. రిలయన్స్ ఫౌండేషన్ కూడా ఫుట్‌బాల్ ప్రతిభను గుర్తించడమే కాకుండా వయస్సు మోసాలను గుర్తించేందుకు ఏఐ సాంకేతికతను వినియోగిస్తోంది. అయితే ఏఐ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డేటా గోప్యత, వైద్య సమాచార భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అథ్లెట్ల ఆరోగ్య సమాచారం అత్యంత సున్నితమైనదని, దాని వినియోగంలో కఠినమైన ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

క్రీడల్లో ఏఐ వినియోగం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, మానవ కోచ్‌ల అనుభవం, మానసిక ప్రోత్సాహం, వ్యక్తిగత మార్గదర్శకత్వానికి ప్రత్యామ్నాయం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డేటా, సాంకేతికత నిర్ణయాల్లో సహాయపడగలిగినా, ఒత్తిడి పరిస్థితుల్లో ఆటగాడిని మానసికంగా సిద్ధం చేయగలిగేది చివరికి మానవ కోచ్ మాత్రమేనని అభిప్రాయపడుతున్నారు.

## బాల కార్మిక రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో 18 ఏళ్లలోపు బాలబాలికలతో పనులు చేయించవద్దని, బాల కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని సహాయ కార్మిక అధికారి సి.హెచ్. వెంకటేశ్వరరావు సూచించారు. ఏడు రోడ్ల కూడలి నుంచి పాత బస్టాండ్ వరకు వాణిజ్య సముదాయాలు, వస్త్ర దుకాణాల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్‌తో కలిసి బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మైనర్లను పనిలో పెట్టుకోకుండా, కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని వ్యాపారులకు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అధికారులు శ్రీహరి, కే.నాగరాజు, నారిమణి, గీత, చైల్డ్‌లైన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## వైఎస్సార్ ఆశయసాధనకు కృషి చేయండి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి గారి జయంతి సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించాయి. యువ నాయకులు, పోలాకి జడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఈదులవలస, నరసన్నపేట పార్టీ కార్యాలయం, వైఎస్సార్ జంక్షన్, ఉర్లాం, కొమనపల్లి జంక్షన్‌లలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## ఏపీఈడబ్ల్యూఐడీసీ బోర్డు సమావేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో చైర్మన్ ఎస్.రాజశేఖర్, ఎండీ దీవాన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బోర్డు సమావేశంలో డైరెక్టర్ పి.ఎం.జె. బాబు పాల్గొన్నారు. విద్యా సంస్థల్లో నిర్మాణంలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన మౌలిక వసతులపై అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాగా, కార్పొరేషన్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచినందుకు ముఖ్యమంత్రికి చైర్మన్, డైరెక్టర్లు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.




## పలు రైలు సర్వీసుల పునరుద్ధరణ

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోని గరుడుబిల్లి-గొట్లాం, డొంకినవలస-కొమటిపల్లి సెక్షన్ల మధ్య నిలిచిపోయిన రైలు సర్వీసులను అధికారులు పునరుద్ధరించారు. గతంలో రద్దు చేసిన, రీషెడ్యూల్ చేసిన పలు రైళ్లను యథావిధిగా నడపనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఇందులో భాగంగా విశాఖపట్నం-భవానీపట్న (58504/58503), విశాఖపట్నం-కోరాపుట్ (58538/58537) ప్యాసింజర్ రైళ్లు పునరుద్ధరించబడ్డాయి. అలాగే విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్ 'సమత ఎక్స్‌ప్రెస్' (12807) జూలై 9న తన సాధారణ సమయానికే బయలుదేరుతుంది. గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243/17244) సర్వీసులు కూడా పాక్షిక రద్దు లేకుండా పూర్తిగా రాయగడ వరకు నడుస్తాయి. మరోవైపు బ్రహ్మపూర్-ఉద్నా 'అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్' (19021) సర్వీసును పునరుద్ధరించినప్పటికీ, ఇది కొంత మేర నియంత్రణ (రెగ్యులేట్) ద్వారా నడపబడుతుందని అధికారులు స్పష్టం చేశారు.

Printed, published, and owned by N.V.S.PRASAD, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh. Postal Regn.No: D/RNP/SKLM/12/2026-2028. RNI NO: APTEL No. 2005/17967